# వనలక్ష్మి

## శ్రీ పుందరపు వేంకటేశ్వరరావు

ప్రకృతి సుందరి తన ముగ్ధ మోహన లావణ్యమంతా ఇక్కడే ఒలకబోస్తున్నట్టుంది చూడు మోహన్! ఆపొదలపై వెర్రిగా విరగబూసిన మల్లెల వాసనలు మత్తెక్కిస్తున్నాయి ఈ పక్క గుత్తులు గుత్తులుగా వేలాడుతున్న రంగురంగుల గులాబీలు మలయానిలానికి మెల్ల మెల్లగా తల లూపుతూ స్వాగతం ఇస్తున్నట్టున్నాయి. అబ్బ! ఆ చెట్లకొమ్మల ఆకులను మరుగుపరుస్తూ కిలకిలమంటూ కూర్చున్న చిలకల ముక్కులు చూడు— చెట్లపై మిరపకాయలు దండలు దండలుగా వేలాడదీసినట్టు కనబడుతున్నాయి. అదుగో! ఆ తోపునుంచి కోకిలస్వామి 'కుహూ కుహూ' మంటుంటే ఈవేపు నుంచి కోకిలస్వామిని తనస్వామిని వెక్కిరిస్తున్నట్టుంది. ఆ కొండ గుట్టను ఒరుసుకుపోతున్న ఆ చిన్న తెలి మబ్బుముక్క లేగదూడ పచ్చికబయళ్లో పరిగెత్తుతున్నట్టు లేదూ? ఇంత సౌందర్యంలోనే ఎంతో గాంభీర్యం! ఇంత కలకలంలోనే ఎంతో ప్రశాంతత! నన్ను ముగ్ధుణ్ణి చేస్తున్నాయి మోహన్! ఇన్నాళ్లుగా లేని మనశ్శాంతిని ఈ వనలక్ష్మి నాకు ప్రసాదిస్తున్నది. కలతలతో, కలహాలతో, ద్వేషాలతో, ద్రోహాలతో, బాధలతో, వ్యాధులతో, అంతా కృతకంగా, ఎంతో వికృతంగా కనబడే నగరవాసం కంటె ఈ వనసీమ నన్నలరిస్తున్నది మోహన్! ఇన్నాళ్లుగా కలలుగన్న ప్రశాంతత నన్ను పలకరించి పులకరింప జేస్తోందోయ్! ఇక్కడే ఎక్కడో చిన్నగుడిసె వేసుకొని, పళ్లు ఫలాలు తింటూ, హాయిగా, నిశ్చింతగా కాలం గడిపి వేస్తాను.—

విహారయాత్రకు వచ్చిన విద్యార్థి బృందాన్ని శిబిరాలవద్ద దిగవిడిచి ఎంతోదూరం జీపులోవచ్చిన ప్రొఫెసర్లు-మోహన్, మనోహర్ ఏటి ఒడ్డున కూర్చుని ప్రకృతిశోభను తిలకిస్తూ ఉండగా మనోహర్ తన అభిప్రాయం మోహన్‌కు తెలియజేశాడు.

"నీది వట్టి ఉద్రేక స్వభావం మనోహర్! ఎంత కవివైనా ప్రకృతి సౌందర్యం నిన్నొక్కణ్ణే ముగ్ధుణ్ణి చేయడం లేదు. చూచి ఆనందించాం. కావాలంటే పదేపదే ఇటువచ్చిపోతూ ఉందాంలే! మన వాళ్లు ఎదురుచూస్తూ ఉంటారు." మోహన్ నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తూ అన్నాడు.

"లేదు, మోహన్! ఇక్కడున్న రెండుక్షణాలు నా మనస్సెంతో తేలికైపోయింది. పడినపాట్లు మరచిపోయాను. నా నిశ్చయానికి ఎదురులేదు."

"నీది వట్టి దుర్బల హృదయం."

"ఈ భూలోక స్వర్గంలో ఉండాలనుకొంటున్నందుకా?"

"ఎంతతోస్తే అంతేకాని, కాస్త నిదానంగా ఆలోచించవ్."

"నిజమే మోహన్. నేను తొందరపడేవాడినే-అయినా, నా తొందరపాటువల్ల ఇంతవరకు ఎవరినీ బాధపెట్టలేదనే అనుకొంటున్నాను."

"ఇదివరకు బాధపెట్టిందీ లేనిదీ నాకు తెలియదు. ఇప్పుడుమాత్రం బాధ కలిగిస్తున్నావ్."

"ఎవరికీ...?నీకా?" మోహన్ మొహంలోకి చూస్తూ ప్రశ్నించాడు మనోహర్.

"నన్నేకాదు మనోహర్, నీమీద గంపెడాశ పెట్టుకుకూర్చున్న సరళను, ఆమె తలిదండ్రుల్నికూడా బాధపెట్టినవాడివౌతావు. కాస్త ఆలోచించు మనోహర్." దీనంగా ప్రాధేయపడ్డాడు మోహన్.

"నువ్వు బాధపడతావని నాకు తెలుసు మోహన్! నువ్వు లేకపోతే నేనెప్పుడో విరాగినైపోయేవాణ్ణి. అయినా నన్ను మన్నించు; నాకు మనశ్శాంతి కలగడంకంటె నీకుమాత్రం కావలసిందేముంది చెప్పు? సరళ—వాళ్ళమాట అంటావా, ఒక్క సంవత్సరంలో తిరిగివస్తాననీ, ఇచ్చినమాట తప్పక చెల్లించుకొని పెళ్లి చేసుకొంటాననీ నచ్చజెప్పు."

"నువ్వు పిచ్చివాడివై పోతున్నావ్."

"అది నిజంగా గొప్ప కాంప్లిమెంట్ మోహన్! పిచ్చివాడికంటె మంచివాడెవడున్నాడు! తల్లిని, తండ్రిని, చెల్లెల్ని—అందర్నీ ఒక్క సంవత్సరంలో పోగొట్టుకొన్న నాకు ఎప్పుడో మతిపోయింది." పొంగుకువచ్చే దుఃఖాన్ని ఆపుకుంటూ అన్నాడు మనోహర్ బరువుగా.

"సరే నడు. ఈ నడిఅడివిలో ఒక్కడివీ ఉండడం అసాధ్యం. అదుగో ఆ కాలిబాట ఏ కొండవాళ్ళ నివాసాలకైనా తీసుకు వెళ్లుతుందేమో చూద్దాం. ఉండేవాడివి నలుగురిమధ్య ఉండడం మంచిది."

కాలిబాట వెంబడే నడవసాగాడు మోహన్. మనోహర్ అతన్ని అనుసరించాడు. స్నేహితులిద్దరూ మెల మెల్లగా ముందుకు సాగుతున్నారు. దూరంనుంచి అస్పష్టధ్వనులు వినవస్తున్నాయి. "మనఊహ సరియైనదే మనోహర్, ఇక్కడ దగ్గరలోనే జనపదం ఉన్నట్టుంది." అన్నాడు మోహన్. ఆ అస్పష్టధ్వనులు క్రమక్రమంగా స్పష్టంగా బిగ్గరగా వినబడుతున్నాయి. పాడుతూ, ఆడుతూ తందనాలాడుతున్న గుంపు మంటల వెలుగులో స్పష్టంగా కనబడింది. పాటలు చక్కగా వినబడుతున్నాయి. మొలలకు తోలుగుడ్డలు చుట్టుకొన్నారు. తలలపై రంగురంగుల పాగాలు, పాగాలపై తెల్లని కుచ్చులు, మెడలో పూసలపేర్లు, చేతికి ఎముకల కడియాలు, చేతులలో వింత వింత వాద్యాలు, విచిత్రమైన పాటలు, అర్థంకాని మాటలు-ప్రొఫెసర్లకు అపూర్వ అనుభూతిని కలిగిస్తున్నాయి. కొబ్బరి దొన్నెలలోని పానీయాన్ని మధ్య మధ్య జుర్రుతున్నారు, గిర్రున తేన్చుతున్నారు, మంటచుట్టూ గిరగిరా తిరుగుతున్నారు, పాట పాడుతున్నారు-ఆ వింత మనుషులు విచిత్రమైన భాషలో :

ఓయ్ హెయ్, ఓయ్ హెయ్
ఓయ్ హెయ్, జం ఝు ఝూం
జం ఝు ఝూం, జాం ఘు ఠోం
గలా బలా జలా ఘాం ఘాం
మిలా కలా నలా ధూం ధాం
బాడబాం, బాడబాం, బాడబాం హెయ్
ఆ డ నాం, ఆడనాం ఆడ నాం జోయ్ !

ఈ ఆగంతకులిద్దర్నీ చూడడంతోటే ఆటపాటలు ఆగిపోయాయి. అందరూ బిలబిలమంటూ ఒక ప్రక్కకు చేరారు. అందరికళ్లూ ఆగంతకులవైపుకు మళ్లాయి. ఒక వృద్ధుడు కర్ర ఊతగాలేచి వీరివైపుకు నెమ్మదిగా అడుగులువేసుకు వచ్చాడు. ఇద్దర్నీ తేరి పార జూచాడు. దారి కడ్డంగా చేతికర్ర పడవేసి రెండు చేతులు పైకెత్తి ఎలుగెత్తి ప్రశ్నించాడు :

"ఓయ్ హెయ్? కాహెకోయ్?"

ప్రొఫెసర్లు ఒకరి మొహం ఒకరు చూసుకొన్నారు. "తెలుగు, తెలుగు" అన్నాడు మోహన్, మీ భాష అర్థంకావడంలేదని సంకేతాలతో సూచిస్తూ.

"హాయ్, తెల్గు-హెయ్ జాండుడాయ్" గుంపువైపుకు తిరిగి కేకవేశాడు ఆ ముసలివాడు.

పాతికేళ్ళ యువకుడొకడు ముందుకువచ్చి ముసలివాడితో ఒక్కక్షణం ఏదో మాట్లాడి, వీరిని చూసి తెలుగులో ప్రశ్నించాడు.

"మీరెవరు? ఏమి పని?"

ఇంతలో ఆ కొండవాళ్ళందరూ వీరిచుట్టూమూగి వింతగా చూస్తూ నిలుచుండిపోయారు.

మోహన్ మనోహర్‌ను చూపిస్తూ జాంకుడాయ్‌కి చెప్పాడు: "ఈయన కొన్ని కష్టాలలోపడి మనశ్శాంతి పోగొట్టుకొన్నాడు. ఈ అడవి అందం, మీ అమాయకత చూచి మీతో కొన్నాళ్లు గడిపి వెడదామనుకొంటున్నాడు. గొప్ప గొప్ప చదువులు చదివిన ఈయన ఉండడం మీకుకూడా లాభిస్తుంది; మీరు అంగీకరిస్తే మీతో కలిసి మెలసి ఉంటాడు." సైగలతో, సంకేతాలతో మాట్లాడిన తెలుగు వారిలో కొంతమందికి కొద్దికొద్దిగా అర్థమయింది. జాండుడాయ్ మోహన్ చెప్పిన విషయం ముసలివాడికి వినిపించాడు. ముసలివాడి కళ్లు మెరిసాయి, అనురాగాన్ని కురిసాయి. మనోహర్ చేతులను తన చేతులలోకి తీసుకొని "అందా హాయ్, జిందోబోయ్!" అని అరిచాడు. గుంపులోని వారందరూ ఎలుగెత్తి "అందా హాయ్, జిందోబోయ్!" అని అరిచారు—ఒక్కొక్కరే వచ్చి మనోహర్ చేతులు అందుకొని పైకెత్తుతూ, మనోహర్‌ను నడిపించుకు వెళ్ళి, కర్రతో కట్టిన తిన్నెమీద కూర్చోబెట్టారు. మోహన్ మనోహర్ ప్రక్కనే నిలబడి అడవిమనుషుల ఆదరణకు ఆనందిస్తున్నాడు. "వీళ్లు నిన్ను రాజును చేస్తున్నట్టున్నారు" అన్నాడు నవ్వుతూ మనోహర్‌ని చూసి.

"ఇంత కర్కశమైన ఆకృతి ఎంత మృదువైన హృదయాన్ని దాస్తున్నదో చూడు మోహన్!" అన్నాడు మనోహర్.

"అవును మనోహర్, హృదయంలోని అమృతాన్ని మాటల్లో, చేష్టల్లో వర్షిస్తున్నారు."

"నాగరికత బలిసిన మనం ఇందుకు పూర్తిగా భిన్నంకదూ మోహన్. హృదయంలో విషం పెట్టుకొని తేనెపూత కబుర్లు చెప్పడం నాగరికత స్వభావం అనిపిస్తుంది." అన్నాడు మనోహర్.

"వీరిని నాగరికులను చేయడానికి ప్రయత్నించకు. ఈ అమాయకులు అమాయకులుగానే ఉండిపోనీ." అన్నాడు మోహన్, మనోహర్‌ను చూస్తూ.

రెండు దొన్నెలనిండా పానీయం తీసుకువచ్చిన ఒక పడుచుపిల్ల వీరి మాటలు వింటూ నివ్వెరపడి నిలిచిపోయింది. మనోహర్ ఆ పడుచునుచూసి "మా కా?" అని సైగతో అడిగాడు. పడుచు తల ఊపి తలకొక దొన్నె అందించింది.

"ఇదేం పానీయమో ఏమిటో మోహన్?" అన్నాడు మనోహర్, కాస్త అసహ్యం కనబరుచుతూ.

"తాజా పండురసం, మంచి పానకం" అంది ఆ పడుచు తెలుగులోనే; అయినా ఒక రకం యాసతో.

"వాసన బాగానే ఉంది, తీసుకుందాం." అన్నాడు మోహన్.

కొండ మనుషుల ఆతిథ్యం లాగా ఆ పానీయం మధురాతి మధురమై రుచించింది.

పానీయం తీసుకుంటూ, పడుచునుచూసి మనోహర్ ప్రశ్నించాడు: "నీకు తెలుగు తెలుసునన్న మాట."

"ఓ బాగా తెలుసు." ఉత్సాహంతో చెప్పింది పడుచు.

"ఓహోఁ-అయితే నీపేరు ఏవిటమ్మాయ్?" అని ప్రశ్నించాడు మనోహర్.

ఆ ప్రశ్నకే ఎదురు చూస్తున్నదా అన్నట్టు చటుక్కున సమాధానం చెప్పింది. "బాణోలక్కి."

"బాణోలక్కి!-విచిత్రమైన పేరు, 'వనలక్ష్మి' అన్నట్టు ధ్వనిస్తున్నది కదూ మోహన్?" అన్నాడు మనోహర్.

"నువ్వు వనలక్ష్మి అని పిలిచినా అభ్యంతరం ఉండదులే" అన్నాడు మోహన్ నవ్వుతూ.

"అవును, నేను 'వనలక్ష్మి' అనే పిలుస్తా" అన్నాడు మనోహర్, బాణోలక్కి వైపుచూస్తూ.

ఇంతలో జాండుడాయ్ ఇప్పపువ్వు, కొబ్బరి పువ్వు, బుర్రగుంజు రెండు ఆకులతో తెచ్చి అందిచ్చాడు అతిథులకు. "తీసుకోండి"అన్నాడు ఆదరంగా. అయిదు నిముషాల్లో ఆకులు ఖాళీ అయిపోయాయి.

చెట్టు క్రింద ఎత్తుగా కట్టి ఉన్న మంచె మీద ఆకు అలం వేసి మెత్తగా ముఖమల్ పగుపులా తయారు చేశారు. మంచె ఎక్కడానికి కొయ్య మెట్లున్నాయి. "దాని మీద పండుకోండి బాబా, ఈ రాత్రికి. రేపు మీకు వేరే గుడిసె ఏర్పాటవుద్ది." అన్నాడు జాండుడాయ్. అడవిలో తిరిగి తిరిగి అలసిపోయిన స్నేహితులకు కళ్లు బరువు లెక్కి పోతున్నాయి. మంచె ఎక్కి అందరికీ చేయెత్తి నమస్కరించారు. "ఆందాహోయ్, జిందోబోయ్" అని ఆటవికులు అరిచి ఒక్కొక్కరే విడిపోయారు.

తెలతెలవారుతూ ఉండగా మోహన్‌లేచి మనోహర్‌ను లేపి అడిగాడు: "నువ్వు పట్టిన కుందేలుకు నాలో కాలు కనబడిందా భాయ్?"

"నేను పట్టే కుందేలుకు ఎప్పుడూ మూడుకాళ్లే కనిపిస్తాయి మీకు; నాల్గోకాలు నా కొక్కడికి మాత్రమే కనిపిస్తూ ఉంటుంది." అని సమాధానం చెప్పాడు మనోహర్ ఆవులిస్తూ.

"అదే! నీ కైనా కనబడుతున్నదా అనే నే నడుగుతున్నాను." అన్నాడు మోహన్.

"కనబడవలసింది నీకు." అన్నాడు మనోహర్ నవ్వుతూ.

"ఇక నీకు చెప్పి లాభంలేదు. అందులో పడుచు పిల్ల తెచ్చిన పానీయం రుచి మరిగావారి. ఇంతలో ఈ అడవి వదలిపెట్టవ్. అయితే నేను వెళ్లిపోతున్నాను. ఆ ఏటిఒడ్డున వదిలిన జీపు ఏమయిందో! మనం ఏ పులికో ఫలహారమై ఉంటామని మనవాళ్లు కంగారు పడుతుంటారు. త్వరలో తిరిగి వస్తావని ఆశిస్తున్నాను. నీ మీద ఆశపెట్టుకు కూర్చున్న సరళ తలిదండ్రులు ఎంత ఇదవుతారో ఏమో! వాళ్ల ఆనందం కోసమైనా త్వరగా తిరిగివచ్చెయ్ మనోహర్!" అనునయిస్తూ చెప్పాడు మోహన్.

"ఒక్క సంవత్సరం ఓపిక పట్టమను మోహన్." అంటూ మనోహర్ మోహన్‌తో కరస్పర్శ చేసి వీడ్కోలు చెప్పాడు. ఇంకా మగతగాఉంటే మళ్లీ మంచెమీద వాలిపోయాడు.

"బాబా, లేవండి - పాలు వస్తున్నాయ్."

ఈ పిలుపుకు ఉలిక్కిపడి లేచాడు మనోహర్. ఒయ్యారంగా, ఓరగా చూస్తూ బాణోలక్కి మంచె అంచున నిలబడిఉంది.

"నువ్వా?"

"లేవండి బాబా, జాండుడాయ్ పళ్లు, పాలు తెస్తున్నాడు. అప్పుడే బారెడు పొద్దెక్కింది." అంది బాణోలక్కి!

చెట్ల గుబుర్ల మధ్య సూర్యబింబం ఎర్ర ఎర్రగా తెల్ల తెల్లగా కనబడుతోంది. పక్షుల కలకలం హెచ్చు పెరిగింది. మనోహర్ లేచి సంచినుంచి టూత్ పేస్టు, బ్రష్ తీసి దంతధావనానికి ఉపక్రమించాడు. బాణోలక్కి ఆశ్చర్యంగా చూస్తోంది.

"ఇదేంటి? ఇదినొక్కితే తెల్లతాచు పిల్లలాగ వొస్తోందే ముద్ద!" అంటూ టూత్ పేస్ట్ ట్యూబ్ నొక్కుతూ ఆనందిస్తోంది బాణోలక్కి.

"ఆముద్దను మెల్లగా ఆ గొట్టంలోకి ఎక్కించు." అన్నాడు మనోహర్.

మనోహర్ దంతధావనం చేసుకొని లేచేసరికి జాండుడాయ్ పళ్లు, పాలగిన్నె పట్టుకవచ్చాడు.

"బాబా ముద్ద లోపలి కెక్కడం లేదు." అంది, బాణోలక్కి మనోహర్‌ని చూస్తూ.

"ఎందుకు ఎక్కుతుందీ? పైకి తీసేముందు ఈ సంగతి ఆలోచించావా నువ్వు? లేదుకదూ! అనాలోచితంగా చేసిన పొరపాటును సరిచేసుకోవడం ఎంత కష్టమో దీనినిబట్టి తెలుసుకోవాలి." అన్నాడు నవ్వుతూ.

బాణోలక్కి బొమముడివేసి ఒక్క క్షణం ఆలోచిస్తూ నిలుచుండి పోయింది. "నిజమే బాబా, మీరన్నమాట." అంది మనోహర్‌ను చూస్తూ, గొప్ప విషయం సులభంగా అర్థమైన ఆనందంతో.

"పళ్లు తీసుకోండి బాబా!" అన్నాడు జాండుడాయ్.

పళ్లు, పాలు తీసుకొంటూ ఉండగా, మనోహర్‌తో జాండుడాయ్ మెల్లగా, వినయంగా చెప్పాడు: "మా పెద్ద మిమ్మల్ని తోడుక రమ్మన్నాడు బాబా."అని.

ఫలహారం ముగించి, "సరే, ఆలాగే వెడదాం." అని బయలుదేరాడు మనోహర్. "బాణోలక్కి నువ్వు బాబాగారి సంచి మెడకు తగిలించుకో." అని హుకుం జారీచేశాడు జాండుడాయ్. "ఓ వస్తున్నా జాండూ!" అంటూ ఆనంద పారవశ్యంతో బయలుదేరింది బాణోలక్కి.

ముగ్గురూ కలిసి తండా పెద్ద వద్దకు వచ్చారు. మనోహర్‌ను చూడగానే అతను లేచి చేతులు పైకెత్తి "ఆందాహోయ్ జిందో బోయ్" అని గట్టిగా అన్నాడు. ఆమాటల అర్థం తెలియకపోయినా మనోహర్ కూడా చేతులెత్తి "ఆందా హోయ్ జిందో బోయ్!" అన్నాడు. గత రాత్రి తనను ఆహ్వానించిన ముసలి వాడే ఆ పెద్ద. జాండుడాయ్‌ని పిలిచి తమ భాషలో మాట్లాడాడు. జాండుడాయ్‌ని చూపిస్తూ 'వినండి' అని సైగతో చెప్పాడు పెద్ద. "ఏమిటి జాండుడాయ్?" అని అడిగాడు మనోహర్. "మా ఆసారాలను, కట్టుబాట్లను మీకు తెలియసెప్పాలి బాబా. మా పెద్ద చెప్పిం దేమిటంటే—" అని గొంతుక సవరించుకొని ప్రారంభించాడు జాండుడాయ్:

"మీ రెవరో మాకు తెలవదు. మేం ఎవరమో మీకు తెలవదు. మీ ఆసారాలు మాకు, మా ఆసారాలు మీకు తెలవ్వు. ఈ అడవిపై మా తండాది అధికారం. మా సట్టదిట్టాలకు తిరుగులేదు; ఎదురులేదు. ఇక్కడ ఉన్నన్నాళ్ళు మీరు మా ఆసారాలను మన్నించాల. మా కట్టుబాట్లకు లోబడి నడుచుకోవాల. మీరు మాలో ఒకరిగా తిరగండి. జాండుడాయ్, బాణోలక్కిలను మీసేవకు నియమిస్తున్నాను. మీకు ఏలోపం రానివ్వకుండా ఆళ్లు సూసుకుంటారు. మీరు గొప్ప చదువులు చదివిన మంచి వోరు. మీ గేనంతో మాకు లాభం కలిగించండి."

"సరే" అన్నట్టు తల ఊపుతూ పెద్ద మొహంలోకి చూశాడు మనోహర్. పెద్ద చిరునవ్వుతో అభినందించాడు.

మనోహర్ రాకతో ఆ అడవిమనుషుల పల్లెపట్టులో నిరాడంబరమైన విప్లవం ప్రారంభమయింది. అడవి మనుషులను మనుషులనుగా చేయడానికి మనోహర్ పడిన శ్రమ వర్ణించరానిది. వారికి శుచి శుభ్రతలు అలవడ్డాయి; చదువు సంస్కారాలు అబ్బసాగాయి; మురికి కూపాలుగా ఉండే గుడిసెలు కడిగిన ముత్యాల్లా తయారయాయి. ప్రతి గుడిసెకు ముందు, వెనక చిన్న చిన్న పూలతోటలు వెలిశాయి; అధి వ్యాధులు ప్రకృతి వైపరీత్యాలు భగవంతుని కోపంగా శాపంగా భావించే వారు వాటిని ఎదిరించి నిర్జించడం నేర్చుకొంటున్నారు. మనోహర్ వారి మనసు నొవ్వకుండా వారి మూఢాచారాలను మాన్పడానికి ప్రయత్నిస్తున్నాడు. వారితో నడక అసిధారావ్రతం లాంటిది. వారెంత సహనశీలురో అంత రౌద్రమూర్తులు. ఎంత అసహాయ శూరులో అంత అమాయకులు. ఎంత సాధుస్వభావులో అంత కిరాతకులు. ఆదరించిన వాణ్ణి ఆరాధిస్తారు, ఆగ్రహించిన వాణ్ణి అంతంచేస్తారు. మనోహర్ నిరంతర కృషివల్ల వారిలోని పశు ప్రవృత్తులు దైవిక శక్తులకు లోబడుతున్నాయి.

బాణోలక్కి, జాండుడాయ్‌లు మనోహర్‌ను కంటికి రెప్పలాగ చూస్తున్నారు. అతన్ని ఒక్క క్షణంవిడిచి ఉండరు. అతని సపర్యలలో తమజీవితం సార్థక మౌతుందని వారిభావం. బాణోలక్కిని మనోహర్ 'వనలక్ష్మి' అని పిలుస్తాడు. బాణోలక్కి మనోహర్‌ను మనోబాబా అంటుంది; అందరూ బాబా అని మాత్రం అంటారు. బాణోలక్కిది పాదరసం లాంటి చురుకయిన బుద్ధి. మనోహర్ చెప్పిన అనేక విషయాలను తేలికగా అర్థం చేసుకొంటుంది. మనోహర్‌కు పువ్వులంటే ప్రాణం. అడవిలోని ఎక్కడెక్కడి పూలమొక్కలను పెళ్ళగించుకొని వచ్చి ఒక పూలవనం తయారుచేశాడు. అక్కడి పూలు ప్రతి ఉదయం కోసుకువచ్చి దండలుకట్టి మనోహర్ మెడలో వేస్తుంది బాణోలక్కి. కుటీరం గుమ్మానికి, గోడలకు దండలు వ్రేలాడదీస్తుంది. అతని పక్కపై మల్లెమొగ్గలు గుమ్మరిస్తుంది.

మనోహర్ చెప్పే కథలంటే చెవి కోసుకుంటుంది బాణోలక్కి. అతని నిరంతర సాహచర్యం వల్ల ఆమె వేషభాషలలో గొప్పమార్పులు వచ్చాయి.

"మనోబాబా, మీరు కథాసాగరులు." అంటుంది.

"లక్ష్మి, నువ్వుకూడా కవివై పోయావు." అంటాడు.

"మీసేవ చేస్తున్నందుకు ఆమాత్రం భాగ్యం అబ్బవద్దా?" అంటుంది.

"అయితే మనం జంటకవులమై పాటలు పాడుకొందాం." అంటాడు.

"అదుగో అక్కడ 'కో' అంటే ఇక్కడ 'కో' అని వెక్కిరించుకుంటున్న కోకిల్లలాగా?" అంటుంది.

"కోకిల బిరుదుకు నువ్వే తగినదానివి." అంటాడు చిలిపిగా.

"ఏం? నల్లగా ఉన్నాననా?" అంటుంది దొంగ కోపం అభినయిస్తూ.

"గ్రహించావు, గడుస్తనం నేర్చావు వనలక్ష్మీ!" అంటాడు నవ్వుతూ.

కిలకిలా నవ్వుకొంటారు. చెట్లమీది చిలకలు బిలబిలమని ఎగురుతూ కిలకిలమంటాయి. గువ్వలు కువకువమంటాయి. నెమళ్లు పురివిప్పి నాట్యం చేస్తాయి. చెట్ల ఆకులు జలజల రాలుతాయి. ఈ దృశ్యాలకు పులకించిపోతాడు మనోహర్.

"ఏంటే బాబాగారితో సరాగాలాడుతున్నావ్!" అని అడుగుతాడు జాండుడాయ్.

"సరాగాలేంటి, బాబా సరదాగా మాట్లాడతారు. అలా మాట్లాడ్డం నేర్చుకోవాలి నువ్వు; వొట్టి మొద్దు అవతారం." అంటుంది బాణోలక్కి.

"నేను మొద్దు నే లేవే ముద్దులగుమ్మ అంటాడు." జాండుడాయ్.

"అబ్బో జాండుడాయ్ కవీస్వరుడైపోతున్నాడండోయ్, ఇంక బతకలేం." అంటుంది వేళాకోళంగా.

"నామాటంటే ఇంత ఎక్కిరింపుగా ఉందటే సిలకా?" అంటాడు జాండుడాయ్, దగ్గరకు వెడుతూ.

"బాబా లోపల ఉన్నారు." అంటుంది బాణోలక్కి. నాలిక కరుచుకు వెళ్లిపోతాడు జాండుడాయ్.

* * * *

ఆకాశం నిర్మలంగా ఉంది. పున్నమ చంద్రుడు వలలవంటి చెట్లకొమ్మలను తప్పించుకొని నడి ఆకాశాన ప్రకాశిస్తున్నాడు. తనకుటీరం వెలుపల పచ్చిక పరుపు మీద తలక్రింద చెయి పెట్టుకొని వెల్లకిలా పడుకొని వెన్నెల వానలో తడుస్తూ చంద్రుణ్ణి చూస్తున్నాడు మనోహర్. చల్లని పిల్లగాలులు పూలవాసనల బరువుతో పడుతూ లేస్తూ అతన్ని ఆసరా చేసుకొని లేచి, దాటి వెళ్లిపోతున్నాయి. కాళ్లమీద మెత్తని చల్లని స్పర్శకు ఉలిక్కిపడి లేచాడు మనోహర్. ఎదర బాణోలక్కి నిలబడి నవ్వుతూ ఉంద. తెల్లని బట్టలలో ఆ నల్లపిల్ల వెన్నెలలో నిగనిగ లాడుతోంది. జడలో ముడిచిన దండలో ముడిచిన వేనవేల మల్లె మొగ్గలు ఉక్కిరి బిక్కిరై వాసనల ఉచ్ఛ్వాస నిశ్వాసాలను వదులుతున్నాయి. దోసిలితో తెచ్చిన మల్లె మొగ్గలు మనోహర్ పాదాలపై పోసింది. ఆ స్పర్శకే మనోహర్ ఉలిక్కిపడిలేచాడు.

"ఓ—నువ్వా వనలక్ష్మీ?" అన్నాడు మనోహర్.

"పువ్వులు మనోబాబా, పువ్వులకే ఇంత భయమా?" అంది చిరునవ్వుతో బాణోలక్కి.

"అయితే ఇంత రాత్రి నువ్వు ఎందుకు వచ్చావ్?"

"మనోబాబా! మీరు, నేను వేసిన మల్లెమొక్క మొగ్గదొడిగింది. తెచ్చి మీకిద్దామని వచ్చాను." అంది బాణోలక్కి.

"అందుకని పనిగట్టుకొని ఇప్పుడు రావాలా?" అన్నాడు మనోహర్.

"అవును మనోబాబా, తెల్లారితే పువ్వులు వాడిపోతాయో! రాలిపోతాయో!" అంటూ మనోహర్ సరసనే కూర్చుంది బాణోలక్కి. విచ్చుతున్న మల్లె మొగ్గల్లాంటి అరమోడ్పు కనులతో మనోహర్‌ను చూస్తూ కూర్చుంది.

"సరే ఇక వెళ్లు." అన్నాడు మనోహర్ బాణోలక్కి కళ్ళలోకి చూస్తూ.

చూస్తూనే ఈ పిల్లకళ్ళు ఎంత అందంగా ఉన్నాయ్ అనుకొన్నాడు.

"మంత్రం వేస్తున్నారా మనోబాబా!" అని కిల కిలా నవ్వింది.

మనోహర్ అలాగ చూస్తునే ఉన్నాడు.

"కళ్లలోకి గుచ్చి గుచ్చి చూస్తుంటే మంత్రం వేస్తున్నారనుకున్నాను." అంది బాణోలక్కి.

"నీకళ్లు బాగుంటాయ్, నవ్వుతున్నట్టు." అన్నాడు మనోహర్, తేరుకొని.

"మిమ్మల్ని చూస్తే వాటికి నవ్వు వస్తున్నదేమో! మీ చూపుల్ని పంపి అడగమనండి." అని నవ్వుతూ, "మరి మీ వేళ్లో ఈ వెన్నెల్లో బంగారపు కనికల్లాగ ఎలా మెరిసిపోతున్నాయో!" అంది బాణోలక్కి, మనోహర్ అరచేయి పట్టి ఎత్తుతూ.

నల్లపిల్ల చొరవకు మనోహర్ చకితుడయ్యాడు. తనకు అంతదూరాన ఉండి సపర్యలుచేసే వనలక్ష్మిలోని ఈ వింత పరివర్తనకు, ఆమె ప్రవర్తనకు ఆశ్చర్యపడుతూ బాణోలక్కి మొహం పరకాయించిచూశాడు. బాణోలక్కి కళ్లు నవ్వుతున్నట్టు, పలకరిస్తున్నట్టు ఉన్నాయి. "నిజమే, ఈ పిల్ల అందం కళ్ళలో ఉంది." అనుఅంటూ ఆ కళ్ల శోభను అలాగే తనివితీరా చూస్తూ ఉండిపోయాడు. బాణోలక్కి మనోబాబా కళ్లలో కళ్లు కలిపింది. మొహానికి మొహం చేర్చింది. "లక్ష్మీ, ఏమిటిది?" అనాలని ఎంత ప్రయత్నించినా మనో

హార్ నోరు పెగలలేదు. ఈ ఆకస్మికపరిణామం అతన్ని అచేతనుణ్ణి చేసింది. నల్లపిల్ల చేతులు అతన్ని కదల నివ్వలేదు. పెదవులు పలకనివ్వలేదు. ఆమెచేతి కీలు బొమ్మై అయిపోయాడు మనోహర్.

అడవికాచిన వెన్నెల ఆనాడు వృథాకాలేదు.

"పూలచెండు పడిపోయింది." అని పిలిచిన పిలుపు వినిపించుకోకుండా తుర్రున ఎగిరిపోయింది బాణో లక్కి.

*   *   *   *

మర్నాడు మనోహర్ స్నానంచేసి తిరిగివచ్చే సరికి ఎప్పటిలాగా తాజా పూలదండలు, రోజాగుత్తులు కుటీరానికి వ్రేలాడడంలేదు. జాండుడాయ్ కుటీర ప్రాంగణంలోని మొక్కలకు నీరు పోస్తున్నాడు. "వన లక్ష్మి రాలేదా జాండుడాయ్?" అని కొస్త బిగ్గరగా అడిగాడు మనోహర్.

"పువ్వులు తేడానికి ఇందాకనగా సచ్చింది బాబా." అన్నాడు జాండుడాయ్, గడ్డిమీదపడి నలిగి ఉన్న పూలదండను ఆవలికి విసరివేస్తూ.

"నేను చూసివస్తా ఉండు." అంటూ మనో హార్ పూలవనానికి వెళ్ళాడు. కొమ్మల్ని రెమ్మల్ని వంచి లతల్ని మొక్కల్ని కూర్చి ఆ పూల వనంలో అతను ఎన్నో లతాగృహాలు తయారుచేశాడు. ఒక పొందరింట్లో కూర్చుని బాణోలక్కి వెక్కివెక్కి ఏడుస్తోంది. మనోహర్‌ని చూసి అదరిపడి లేచింది. దుఃఖం కట్టలు త్రెంచుకువచ్చింది. విలవలమని ఏడుస్తూ మనోహర్ కాళ్లు పట్టుకొని "నన్ను మన్నించు మనోబాబా!" అంది.

"నాకు ఎంతవిచారం కలిగిందో నీకు తెలియదు లక్ష్మి! అయిపోయినదానికి విచారించి ప్రయోజనం లేదు. క్షణిక దౌర్బల్యం శాశ్వత కళంకాన్ని తేకుండా ఉంటే అదృష్టవంతులమే ఇద్దరమూ." అన్నాడు మనోహర్.

మీరు నడిచినదారికూడా తొక్కే అర్హత లేని దాన్ని మీకు అపచారం చేశాను బాబూ." ఏడుపు ఆపుకుంటూ అంది బాణోలక్కి.

"అపచారం చేసింది నేను లక్ష్మి! అదంతా ఒక పీడకలగా మరిచిపోదాం." అన్నాడు అనునయిస్తూ.

"మనోబాబూ, మీరు ఆరోజున-అంటే ఈ ఆడ వికి వచ్చిన మర్నాటి ప్రొద్దుట మొహం కడుక్కుంటూ ఒకమాట అన్నారు జ్ఞాపకం ఉందా?" అని ప్రశ్నిం చింది బరువుగా బాణోలక్కి.

"ఏం అన్నాను?" జ్ఞాపకం తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తూ అడిగాడు మనోహర్.

"పళ్లు తోముకొనే ముద్దను గొట్టంనొక్కి నేను పైకితీసినప్పుడు, ఆ ముద్దను లోపలికి ఎక్కించ మన్నారు. ఎక్కడంలేదని నేను చెబితే పైకితీసేముందు ఈ సంగతి ఆలోచించావా? ఆలోచించకుండా చేసిన పొరపాటును సరిచేసుకోవడం ఎంత కష్టమో దీనినిబట్టి తెలుసుకోవాలి అన్నారు" అంది బాణోలక్కి.

"అవును లక్ష్మి, జ్ఞాపకం వచ్చింది."

"ఆ మాటలు ఎన్నిసార్లో మననం చేసుకొనే దాన్ని మనోబాబా. అయినా కాలుజారింది. ఇంక ఈ పొరపాటును ఎవరూ సరిదిద్దలేరు. మా కులదేవత బాణోలక్కిదేవికూడా ఏమీ చేయలేదు." మళ్ళీ దుఃఖంతో కంఠం రుద్ధమైపోయింది బాణోలక్కికి.

"ఆ రోజున యథాలాపంగా అన్నమాట ఇప్పుడు మన కన్వయిస్తున్నది. నిజంగా నువ్వన్నట్టు ఇటువంటి పొరపాట్లు ముందు జరగకుండా జాగ్రత్త పడడం ఇకనైనా నేర్చుకోవాలిగాని, ఏడుస్తూకూర్చుంటే ఏం ప్రయోజనం లక్ష్మి!" అన్నాడు మనోహర్.

"నాకిక ఏడుపే బాబా." అని లోపల అనుకొని కళ్లుతుడుచుకు లేచింది.

"నేను కూడా సాయం చేస్తాను రా, పూలు కోద్దాం." అన్నాడు మనోహర్.

ఇద్దరూ పూలుకోసుకు వచ్చేసరికి జాండుడాయ్ పులుకు పులుకుమని చూస్తున్నాడు. "లాకోబాయాకు జ్వరం ఎలాగ ఉందో చూసివస్తాను. ఈలోగా దండలు గుచ్చుతుండు లక్ష్మి." అని చెప్పి వెళ్ళిపోయాడు మనోహర్.

మనోహర్ దూరం వెళ్లేవరకు చూస్తూఉన్న జాండుడాయ్ కుటీరంలో ప్రవేశిస్తూ "ఏం లక్కి ఏం చేశావ్? పండగ దగ్గరపడింది." అని అడిగాడు.

బాణోలక్కి పలకలేదు.

"నిన్నే, ఈ రాత్రి కెడదామా పూలవనానికి?"

బాణోలక్కి పలకలేదు.

"లుంగేసుకు తీసుకుపోతేగాని లొంగవ్. ఏడాది నుండి రేపుమాపు అని దాటేస్తున్నావ్." జాండుడాయ్ కొస్త తీవ్రంగానే అన్నాడు.

బాణోలక్కి తలవంచుకొని పూలు గుచ్చుతోంది. జాండుడాయ్ గుచ్చి గుచ్చి అడుగుతున్నాడు:

"ఎంకా ఎన్నాళ్లు ఇట్టా దాటేస్తావే? నీమీదే ఆశలెట్టుకున్నానే! ఏమే, లక్కి! ఇవ్వాళ వస్తావు గదూ?" అనునయంగా, అనురాగం గుమ్మరిస్తూ అడి గాడు జాండుడాయ్.

బాణోలక్కి వెక్కి వెక్కి ఏడవడం విని అదిరి పడి లేచాడు జాండుడాయ్; దగ్గరికివెళ్ళి గడ్డంపట్టుకొని తలపైకెత్తుతూ దీనంగా ప్రశ్నించాడు:

"ఏం లక్కీ, నేను ఇష్టంలేనా?"

"జాండూ, నన్ను మరిచిపో." గొంతుక సవరించు కొని చెప్పలేక చెప్పింది బాణోలక్కి.

"అయితే నీ మనసు ఎవరిమీదో వాలిందన్న మాట?" నిరాశా నిస్పృహలతో, కించిదుద్వేగంతో అడిగాడు జాండుడాయ్.

"అవన్నీ తరచకు. ఇంక నీకు దక్కను." అంది బాణోలక్కి.

"నాగుండెల్లో నిప్పులుపోసిన ఆ మగధీరు డెవడే?" ఉద్రేకం పొంగుకు వస్తుండగా తీవ్రస్వరంతో ప్రశ్నించాడు.

"జాండు, తప్పునాది. నీకు ఆసచూపి, బాసచేసి, మాట తప్పాను. తలవని తలంపుగా కాలుజారిపోయింది. నన్ను మరిచిపో జాండూ!-నిన్ను వేడుకొంటున్నాను."

"పేరు చెప్పవా?" మరింత ఉద్రేకంగా అడిగాడు.

"తప్పు నాదైనప్పుడు, ఎవరైతే ఏం జాండూ. బాణోలక్కి దేవిముందు రేపెలాగా చెప్పక తప్పదు. దేవి ముందుకూడా నిజం దాస్తానా జాండు? నువ్వు కోపం తెచ్చుకొంటే ఏం వస్తుంది చెప్పు అంతా అయి పోయిన తర్వాత?"

"నన్ను దగాచేస్తివిగదే పిసాళీ!" అంటూ కుప్పలా కూలబడ్డాడు. కాస్సేపటికి తెప్పరిల్లి లేచాడు. గొణుక్కుంటూ, సణుక్కుంటూ పెద్ద పెద్ద అంగలువేసుకొని బైటకు వెళ్ళిపోయాడు.

"లక్ష్మీ, మీరు కీచులాడుకున్నారా ఏమిటి? పిలిచినా వినిపించుకోకుండా వెళ్ళిపోతున్నాడు జాండు డాయ్ కోపంగా." అంటూ కుటీరంలోకి అడుగు పెట్టాడు మనోహర్.

మనోహర్ మాట వింటూనే కళ్ళు తుడుచుకొని పూలు గుచ్చడం ప్రారంభించింది మళ్ళీ బాణోలక్కి.

"ఇంతసేపు ఈ కాస్త దండా గుచ్చావ్? నీ మనస్సు బాగాలేదు ఇవ్వాళ." అన్నాడు మనోహర్.

"లేదు మనోబాబా, ఇదుగో అయిదు నిమషాల్లో అయిపోతాది." అంటూ వడివడిగా గుచ్చుతూ, తలవంచుకొనే నెమ్మదిగా ప్రశ్నించింది:

"మీరు మీ ఊరు వెళ్ళిపోవడానికి నిశ్చయం చేసుకొన్నట్టేనా మనోబాబా?"

"నిశ్చయానికి ఏముంది లక్ష్మీ! వెళ్ళాలని గట్టిగా బుద్ధిపుడితే, ఎంత ఆకస్మికంగా ఇక్కడకు వచ్చానో అలాగే బిచానా ఎత్తివేస్తాను. జీవితంలో అనేక కష్టాలు—ఒకదాని వెంబడి ఒకటి చుట్టుకొనేసరికి మన శ్శాంతి పోయింది. ఈ వనశోభ నన్ను ఆనందపరచింది. అంతే, మోహన్‌ని పంపి నేను మీలో కలిసి పోయాను. ఈ ప్రకృతి సౌందర్యం, మీవాళ్ళ ఆదరణ—ముఖ్యంగా నువ్వు, జాండుడాయ్ చూపిన ఆత్మీయత నన్ను మళ్లీ మనిషిని చేశాయి లక్ష్మీ." అన్నాడు మనోహర్.

"ఎన్నాళ్ళని చెట్ల వెంట పుట్లవెంట తిరుగుతారు మనోబాబా! వెళ్లి పెళ్లి చేసుకొంటే మాఅక్క అన్ని కష్టాల్నీ మరిపించేస్తుంది." అని తల పైకెత్తి మనోహర్ మొహంలోకి చూస్తూ ఉండిపోయింది.

మనోహర్ మాట్లాడకుండా పరధ్యానంగా ఉండి పోయాడు. బాణోలక్కి నవ్వుతూ అడిగింది.

"మనోబాబా, మాఅక్కని ఇంకా ఎన్నాళ్లు కని పెట్టుకు కూర్చోమంటారు?"

మనోహర్ ఉలికిపడి బాణోలక్కివైపు చూశాడు. బాణోలక్కి నవ్వుతూ లేచి నిలబడింది.

"నీకెప్పుడు చెప్పాను లక్ష్మీ?" ఆశ్చర్యంగా ప్రశ్నించాడు మనోహర్.

"ఎప్పుడో నా? ఇప్పుడే! మీరు దాచినా, మీ మొహం దాచలేదు."

"నువ్వు ఆవులిస్తే ప్రేవులు లెక్కపెట్టగలవు లక్ష్మీ! నిజమే, సరళ నాకోసం ఎదురుచూస్తూ ఉంటుంది. ఏడాదిలో తిరిగివస్తానన్నాను. నేనువచ్చి ఏడాది అయిందికాదూ లక్ష్మీ?"

"'బరోబరణ్' పండగ అయిన మర్నాటిరాత్రి 'అగ్గిపూజ' జరుగుతున్నప్పుడు వచ్చారు. రేపు 'బరో బరణ్' పండగ. రేపటికి సరిగ్గా సంవత్సరం అవుతుంది మనోబాబా! సరళ అక్కను ఎక్కడ విడిచివచ్చారు?"

"ఈసారిమాత్రం నువ్వు ఓడిపోయావు లక్ష్మీ! నాకు, సరళకు ఇంకా పెళ్ళికాలేదు." అన్నాడు నవ్వుతూ మనోహర్.

"మాట ఇచ్చి వచ్చారు కదా? మాటఇస్తే అయి నట్టుకాదా మనోబాబా. మీరు అన్నమాట తప్పడం అంటూవుండదు."

"నిజమే లక్ష్మీ! తప్పుదామన్నా తప్పడానికి వీలులేదు. సరళ తండ్రికి మానాన్నగారు వాగ్దానం చేశారు, సరళను కోడలిని చేసుకొంటానని. ఆముచ్చట తీరకుండానే, వెళ్లిపోయారు నాన్నగారు. ఆయన

ఆఖరికోరిక కూడా అదే లక్ష్మీ! ఆయన కోరిక తీర్చడానికైనా సరళను చేసుకోవాలి."

"అవేం మాటలు మనోబాబా? మీనాన్నగారి కోరిక తీర్చడంకోసమేనా మీరు సరళ అక్కను చేసుకొనేది; అయితే అక్క అంటే ఇష్టం లేదా?"

"ఇష్టమూలేదు. అయిష్టములేదు. అయినా, సరళను చేసుకోవడం ఖాయం."

"బాబా! మీరు పెళ్ళి చేసుకొని సరళ అక్కను తీసుకొచ్చి మా అందరికీ చూపించండి."

"మీ అందరూ రాకుండా నా పెళ్ళి అవుతుందా లక్ష్మీ!" అన్నాడు మనోహర్.

పెళ్లి ప్రసక్తి మనోహర్ దృష్టిని గత స్మృతి వీథులలోకి తీసుకు వెళ్ళింది. తండ్రి మరణించేముందు తన చేయి నొసలమీద వేసుకొని "నాయనా! సరళను కోడల్ని చేసుకోవాలని ఉవ్విళ్లూరాను. నా చేతుల మీదుగా మీ పెళ్ళి చేసే భాగ్యం నాకిక లేదు. నా ఈ ఆఖరి కోరికను తీర్చు నాయనా! సరళ నీ కన్ని విధాల తగిన భార్య." అన్నారు తండ్రి. "అలాగే నాన్నగారూ! మీ కోరిక ఎలాఉంటే అలాగే జరుగుతుంది. ఈ విషయంలో మీరు బెంగపెట్టుకోనక్కర్లేదు" అని వాగ్దానం చేశాడు తను. ఆదృశ్యం మనోనేత్రాలముందు లీలగా కనబడేసరికి మనోహర్ నేత్రాలు చెమర్చాయి. రెండు కన్నీటిబొట్లు రాలిపడ్డాయి.

"మనోబాబా! అన్నీ తెలిసిన మీరే ఇలాగ ఇదవుతున్నారేమిటి? లేవండి, దండలు గుచ్చడంలో నాకు కొంచెం సాయంచేయండి." అంది బాణోలక్కి.

మనోహర్ తేరుకొని, "లక్ష్మి ఇక దండలు కట్టిపెట్టు, పొద్దెక్కింది. జాండుడాయ్ ఎక్కడికి వెళ్లాడో ఏమో నువ్వు వెళ్లి పాలు తీసుకురా." అన్నాడు.

"తెస్తున్నా బాబా!" అంటు పాలగిన్నెతో అడుగుపెట్టాడు జాండుడాయ్, బైట పొంచి వారి మాటలు వింటున్నాడో ఏమో!

* * * *

బరోబరణ్ ఉత్సవం ఏడాదికొకసారి వస్తుంది. వరవరణం జరిగే ఉత్సవం అన్నమాట. పెళ్లికూతుళ్ళ పండుగ అని కూడా అంటారు. యుక్త వయస్సు వచ్చిన ఆడపిల్లలను ఒక సంవత్సరం గడువిచ్చి వరుణ్ణి ఎన్నుకోనమంటారు. ఈ ఉత్సవం సందర్భంలో, వారి కులదేవత బాణోలక్కిదేవి ఆలయంలో దేవి సాక్షిగా పెద్దల సమక్షంలో ఆ ఆడపిల్లలు తమ కన్నె చెర విడిపించిన మగవాడి పేరు చెప్పాలి. పేరు చెప్పిన వాడే భర్త అవుతాడు. తొలుదొల్త కన్నెచెర విడిపించిన వాడే భర్త అవుతాడు కాబట్టి పెళ్లిని గురించి ఒక ఒప్పందానికి వచ్చిన తర్వాతనే ఆడపడుచు ఒడబడుతుంది.

బాణోలక్కిదేవి ఆలయం స్త్రీలతో, పురుషులతో, పిన్నలతో, పెద్దలతో క్రిక్కిరిసి ఉంది. దేవిని పూలతోను, పూసలతోను అలంకరించారు. దేవీ పీఠానికి ఈవల ప్రక్కగా ఎత్తైన ఆసనంమీద పూజారి కూర్చున్నాడు.

ఆనాటి వరణానికి ఆరుమంది పడుచులు నిరుడే నిర్దేశించబడ్డారు. వారిలో బాణోలక్కి ఒకతె. మిగతా అయిదుగురు పడుచులు నిండుగా ముస్తాబై, తుప్పన తూలుతూ, సంతోషం పట్టలేక నవ్వులు గుమ్మరిస్తూ పిలుపుకోసం క్షణమొక యుగంగా గడుపుతున్నారు. గుంపులోని తమ వరుడిపై ముసిముసి నవ్వులు విసరుతున్నారు. బాణోలక్కిలో ఈ ఆనంద చిహ్నాలు కనబడడంలేదు. దిగులుగా, దీనంగా తలవంచుకొని కూర్చొని ఉంది. ఆమెను చూచినవారికి ఆశ్చర్యం కలుగుతోంది!

పూజారి బిగ్గరగా ఒక్కొక్క పడుచుకో పేరుపెట్టి పిలుస్తున్నాడు. ఒయ్యారంగా వచ్చి, అలవోకగా శపథంచేసి, ఆనందంగా కన్నె చెరవిడిపించిన వరుడి పేరు చెబుతుంది. గుంపులోని వరులు ముందుకు తోసుకు వచ్చి వధువుల చేయిపట్టుకొని బాణోలక్కిదేవికి మ్రొక్కి, ప్రేక్షకుల కోలాహలం మధ్య బైటకు వెళ్ళిపోతారు భార్యాభర్తలుగా—ఈ కర్మకాండ యావత్తు చకచకా జరిగి పోతున్నది.

పూజారి గొంతుక సవరించుకొని, నిలిచి, చేయి పైకెత్తి గంభీరంగా "బాణోలక్కి! బాణోలక్కి! బాణోలక్కి!" అని ముమ్మారు పిలిచి బాణోలక్కి వైపుచూసి కూర్చున్నాడు.

బాణోలక్కి మెల్లగా లేచింది. అడుగుల్లో అడుగులు వేసుకుంటూ వెళ్లి బాణోలక్కి దేవికి ముమ్మారు ప్రదక్షిణం చేసింది. పూజారి పాదాలు కళ్లకు అద్దుకుంది. ప్రేక్షకులలోని పెద్దలకు వంగి నమస్కరించింది. ముళ్లతోచేసిన ధర్మకిరీటం బాణోలక్కి తలపై ఉంచాడు పూజారి.

బరువుగా తల ఎత్తి పూజారి మొహంలోకి చూసింది బాణోలక్కి.

"బాణోలక్కా! శపథం చెయ్యి." అన్నాడు పూజారి. పూజారి ఒకొక్క మాట చెప్పుతుండగా తల వంచుకొని మెలమెల్లగా ఉచ్చరిస్తోంది బాణోలక్కా:

"బాణోలక్ష్మీదేవి సాక్షిగా—ఇక్కడ కూడిన పెద్దల, పిన్నల, స్త్రీల, పురుషుల సమక్షంలో—గాలిదేవుడిమీద, అగ్నిదేవుడిమీద, వానదేవుడిమీద బాస చేసి, నా కన్నెచెర విడిపించిన వన్నెకాడి పేరు చెప్పుతాను. నన్నేలుకొనడానికి నా ఏలిక అంగీకరిస్తే అతనితోనే నా మనుగడ గడిపివేస్తాను. కష్టంలో, సుఖంలో, కలిమిలో, లేమిలో, రోగంలో, ఆరోగ్యంలో అతని అండనే ఉంటాను."

శపథం పూర్తిచేసి ఏకధారగా కన్నీళ్లు కార్చుతూ స్థాణువులాగా నిలబడింది. ప్రేక్షకులు సంభ్రమాశ్చర్యాలతో రెప్ప వేయక బాణోలక్ష్మిని చూస్తున్నారు. చీమ చిటుక్కుమంటే వినబడే నిశ్శబ్దం ఆలయంలో ఆవరించింది. అందరికీ ఏదో ఆతురత, అవ్యక్తమయినభయం, ఎవరిపేరు చెబుతుందో అనే ఉత్కంఠ, ఏ వైపరీత్యం జరుగుతుందో అనే ఆశంక! ఒక్కరూ నోరు మెదల్పడం లేదు. ఒక్కరూ రెప్ప వేయడంలేదు.

"బాణోలక్ష్మీ చెప్పవమ్మా నీ వరుని పేరు?" పూజారి మళ్ళీ హెచ్చరించాడు. బాణోలక్ష్మి ఒక అడుగు ముందుకువేసింది. బాణోలక్ష్మీదేవికి తిరిగి నమస్కరించింది. 'నన్ను మన్నించండి' అన్నట్టు అందర్నీ ఒకసారి కలయజూచింది. కంపిస్తున్న కంఠంతో మెల్లగానే అయినా స్పష్టంగా చెప్పింది:

"మ-నో-హ-ర్-బా-బా."

ప్రేక్షకులు ప్రాన్పడిపోయారు. బాణోలక్ష్మి తల వంచుకుంది. ఆలయం కోలాహలంతో మారుమ్రోగింది. గుడి గంట భయానకంగా మ్రోగింది. తీతువు పిట్ట అరుస్తూ ఎగిరిపోయింది. కొండవెనకనుంచి ఆడుపులి దీనంగావేసిన కేక మెల్లగా వినబడింది. "బాబా ఎక్కడ?" "రాలేదా?" "ఆయన దీనిని ఏలుకోవడ మేమిటి?" "నక్క ఎక్కడ నాకలోక మెక్కడ?" "ఆయనను పడగొట్టిందేం పొయ్యేకాలం!" "ఆయనది మాత్రం తప్పు కాదా?" "దీనికి బ్రహ్మచర్యం తప్పదు." అనే విమర్శ ప్రతివిమర్శలతో ఆలయం ప్రతిధ్వనించింది. "ఆగండి!" అని చేయి పైకిఎత్తాడు పూజారి. మళ్ళీ నిశ్శబ్దం అలముకొంది భయంకరంగా!

"బాణోలక్కా! నీవరుడు రాలేదు, కారణం?" అని ప్రశ్నించాడు పూజారి.

"నేను బ్రహ్మచారిణిగా ఉండిపోతాను." పొంగుకు వస్తున్న దుఃఖాన్ని దిగమింగుతూ సమాధానం చెప్పింది బాణోలక్కా.

"అంటే—నీ వరుడు నిన్నేలుకో డన్నమాట?" గంభీరంగా ప్రశ్నించాడు పూజారి.

"నేను బ్రహ్మచారిణిగా ఉండిపోతాను; నన్ను మన్నించి, తరచి తరచి అడగకండి." దుఃఖంతోనే అయినా దృఢంగా చెప్పింది బాణోలక్ష్మి.

'కన్నెచెర విడిపించిన వన్నెకాడు' ఏలుకొనకపోతే తను ముందు నడుచుకొనవలసిన నడతను గురించి, మర్నాటి రాత్రి జరిగే 'అగ్గిపూజ' సమయంలో అగ్నిసాక్షిగా ఆ పడుచు రెండవ శపథం చేయాలి. ఈ విషమస్థితిని ఇదివర కెప్పుడూ ఎదుర్కొనని పూజారి తికమకపడ్డాడు. ఇటువంటి ఘటన తన తాత తండ్రుల హయాములో కూడా జరిగినట్టు వినలేదు. వరుడు రాకపోవడం అతని అనంగీకారంగా తీసుకోవాలో, అతని ముఖతః విన్న తర్వాత తర్వాతి కర్మకాండ జరిపించాలో అతనికి పాలుపోలేదు. మనోహర్ బాబా దగ్గరకు తాను వెళ్లి అడగలేడు. అతనంటే అకారణ భయం! "మిగతా కర్మకాండ యథాప్రకారంగా రేపటి అగ్గిపూజ దగ్గర జరుగుతుంది." అని ప్రకటించి అందరినీ వెళ్ళిపొమ్మన్నాడు. జాండుడాయ్‌ని దగ్గరకు పిలిచాడు. జాండుడాయ్ నిప్పులు గ్రక్కుతున్నాడు. పూజారి మరీ దగ్గరకు పిలిచి నెమ్మదిగా అడిగాడు. "జాండుడాయ్, నీకు బాబా దగ్గర చనువు ఎక్కువ. ఆయన అభిప్రాయం తెలుసుకు వస్తావా?"

"ఆయన దీన్ని ఏలుకోవడ మేవిటి?" అన్నాడు జాండుడాయ్ కోపంగా, వెక్కిరింపుగా.

"అదికాదు జాండు! బాబా అభిప్రాయం తెలుసుకొనకుండా మనం తర్వాతి కర్మకాండ ఎలా జరిపిస్తాం చెప్పు? ఏలుకోనిమాట నిజమని నాకూ తెలుసు." అన్నాడు పూజారి.

"అయితే దీన్ని ఎందుకు చెఱిచాడు?" కోపం వెళ్లగక్కుతూ అన్నాడు జాండుడాయ్.

"అదంతా మన కనవసరం జాండు! రేపు సాయంత్రంలోగా ఆయన అభిప్రాయం తెలుసుకు రావాలి నువ్వు." అన్నాడు పూజారి.

జాండుడాయ్ తటపటాయించి, "సరే!" అని బైటకు వెళ్లిపోయాడు.

కాలరుద్రుడులాగా బైటకువచ్చిన జాండుడాయ్‌ని వేపచెట్టు చాటున పొంచిఉన్న బాణోలక్కి చూచింది. నిప్పులు గ్రక్కుతున్న అతని కళ్లుచూసి అదరిపోయింది. పుచ్చపువ్వులాంటి వెన్నెలలో, మసి బొగ్గులాంటి జాండుడాయ్ కళ్లు చింతనిప్పుల్లాగ వెలిగిపోతున్నాయి.

"జాండుడాయ్!" ఎంతోమృదువుగా పిలిచింది బాణోలక్కి.

అదరిపడి వెనుదిరిగిచూశాడు జాండుడాయ్. "ఛీ పోవే గరాస!" తుప్పున ఊసి ముందుకు సాగిపోతున్నాడు జాండుడాయ్.

బాణోలక్కి వెంటబడి జాండుడాయ్‌ని నిలబెట్టగలిగింది.

"ఎవరిమీద కోపం? పోనీ నన్ను చంపెయ్." వెక్కివెక్కి ఏడుస్తూ అంది బాణోలక్కి.

"నిన్నా?—నిన్నెందుకు?" నేలను తన్నుతూ అడిగాడు జాండుడాయ్.

"నీకు మాట ఇచ్చి మోసంచేశాను కాబట్టి."

"నువ్వుకాదు మోసం చేసింది."

"మరెవ్వరు?"

"ఎవరో నీకే తెలుసు."

"మనోబాబామీదా నీ కోపం?" గాద్గదికంగా ప్రశ్నించింది బాణోలక్కి.

జాండుడాయ్ సమాధానం చెప్పలేదు.

"నిన్ను అంత ఆప్యాయంగా చూస్తున్న మనోబాబా మీదా నీ కోపం జాండుడాయ్?" ఏడుస్తూ అడిగింది బాణోలక్కి. జాండుడాయ్ కళ్ళెత్తి బాణోలక్కి మొహంచూసి ఉస్సూరని నిట్టూర్చి ఉండిపోయాడు.

"నామాట నమ్ము జాండు. తప్పంతా నాది. బాబా దేవుడిలాంటివాడు. పాపచింతలేని పసిపాపలాంటివాడు. మన కట్టుబాట్లు తెలియని బాబాను అక్రమంగా, ఆకస్మికంగా, లొంగదీశాను. అలాగ చేస్తానని నేను కూడా అనుకోలేదు జాండు, నిజంగా. జరిగినదానికి నేను అనుభవిస్తానంటున్నానుగా."

"నువ్వు నాకు కావాలి."

"ఎలాగ? ఎలా చెప్పు? కట్టుబాట్లు తప్పితే తల నరికివేస్తారే! నాకోసం ప్రాణం పోగొట్టుకుంటావా పిచ్చివాడా? పోనీ, నీకోసం నేను చచ్చిపోతా, చంపెయ్ నన్ను?"

"బాబా నిన్నేలుకొంటాడా?"

"నా తప్పుకు ఆయనను ఫలితం అనుభవించనిస్తానా జాండు! మన ఆచార వ్యవహారాలు తెలియని ఆయన్ని ఈ ఉచ్చులో ఇరికించి నాశనం చెయ్యలేను. ఈ సంగతి బాబాకు తెలియడం కూడా మంచిది కాదు. ఆయన స్వభావం నువ్వు ఎరుగుదువు. ఆయన సుఖంగాఉంటే నాకు సంతోషమే జాండు. బాబా కోసం ఎదురుచూసే పెళ్లి కూతురు ఉంది. వారి జీవితం ధ్వంసంచెయ్యను." ఉద్వేగంతో చెప్పింది బాణోలక్కి.

"నీ పడుచుదనం ఈ అడవిపాలుచేసి, తాను హాయిగా పెళ్లిచేసుకోడానికి వెళ్లిపోతా డన్నమాట."

"మళ్ళీ మొదలుకు వస్తున్నావు జాండు. ఆయన దేం తప్పుంది చెప్పు?"

తల పంకించి ఊరుకున్నాడు జాండుడాయ్.

"బాబాకు అపకారం తలపెట్టనని ఒట్టు వెయ్యి జాండు." దీనంగా ప్రాధేయపడింది బాణోలక్కి.

"బాబా తప్పులేదంటున్నావుగా. ఆయన జోలికి వెళ్ళడం ఎందుకులే!" అన్నాడు జాండుడాయ్.

"నువ్వు మంచివాడివి జాండు. 'రాగోజాయ్' కూతురు వచ్చే యేడు పేరుచెప్పుతుంది. నిన్ను కోరుకోమని చెప్పుతాను." అంది బాణోలక్కి.

"అదంతా ఇప్పు డెందుకులే!" అని వెకిలినవ్వు నవ్వుతూ వెళ్లిపోయాడు జాండుడాయ్.

మనోబాబా కుటీరంవైపుకు కాక, తన కుటీరం వైపుకు వెళ్లిపోతున్న జాండుడాయ్‌ని చూసి తేలికపడిన హృదయంతో బాణోలక్కి తనయింటికి వెళ్లిపోయింది.

* * * *

నాటిరాత్రి జరిగిన ఆకస్మిక ఘటన మనోహర్‌కు బాధాకరమయింది. అనుక్షణం హృదయాన్ని కెలుకుతున్నది. ఆదరించి, గౌరవించినవారికి అనాలోచితంగా అపచారం చేశానని బాధపడుతున్నాడు. నలుగురితో కలిసిమెలిసి తిరగడానికి ఇదివరకులాగ మనస్కరించడం లేదు. బరోబరణ్ ఉత్సవానికి రమ్మని కబురు వచ్చినా కదలకుండా కుటీరంలోనే పడుకొని గత చరిత్రను మననం చేసుకొంటున్నాడు. బైట వెన్నెల పుచ్చపువ్వులా కాస్తోంది. వనలక్ష్మి చెప్పినట్టు సరళ నా జీవితంలో వెన్నెలలు కురిపించి కష్టాల్ని మరిపిస్తుందేమో అనుకుంటూ ఆలోచనా ప్రవాహంలో కొట్టుకు

పోతున్న మనోహర్‌కు కుటీర ద్వారం దగ్గర నల్లనినీడ కనబడింది. ఆ విచిత్ర రూపాన్ని క్రీగంట చూస్తూ ఏం జరుగుతుందో చూద్దామని అలాగే పడుకొని ఉన్నాడు. ఒక వ్యక్తి నల్లని ముసుగుతో మెల్ల మెల్లగా అడుగులు వేసుకొని లోపలికి వచ్చాడు. చేతిలో పెద్ద రాయి ఉంది. ఆగంతకునిచూసి మనోహర్ ఆశ్చర్యపడ్డాడు. ఆ నడకలో, ఒడుపులో కీడు శంకించాడు. తటాలున లేచి "ఎవరది?" అని బిగ్గరగా అరిచాడు. 'ఎవరది?' అని కొండ కోన ప్రతిధ్వనించింది. ఆగంతకుడు భయపడి, రాయి క్రిందపారవేసి వెనుదిరిగి పారిపోతున్నాడు. రెండు అంగలలో వెళ్లి మనోహర్ అతని చేయిపట్టి నిలబెట్టాడు. మొహం మీది ముసుగు తొలగించి మనోహర్ నిశ్చేష్టుడైపోయాడు. ఆ వ్యక్తిమొహం వెన్నెలలో వెలవెలబోతూ కనబడింది.

"జాండుడాయ్ నువ్వా?" దిగ్భ్రమతో ప్రశ్నించాడు, మనోహర్.

జాండుడాయ్ కొయ్యబారిపోయాడు. తల వంచుకు నిలబడిపోయాడు.

"ఏం జాండుడాయ్?" తీవ్రంగా ప్రశ్నించాడు మనోహర్.

"బాబా! మన్నించండి, బాబా! మన్నించండి!" అని ఏడుస్తూ మనోహర్ కాళ్లమీద పడిపోయాడు జాండుడాయ్.

మనోహర్‌కు అంతా అగమ్యగోచరంగా ఉంది. తనను చంపడానికి జాండుడాయ్ ఎందుకు వచ్చినట్టు? తానేం చేశాడని!

జాండుడాయ్ తల బాదుకొంటున్నాడు. ఏడుస్తున్నాడు. మనోహర్ పాదాలు కన్నీళ్లతో కడిగి వేస్తున్నాడు. రెక్క పుచ్చుకొని లేవదీశాడు మనోహర్. "ఒరే నువ్వు ముందు ఆ ఏడుపు కట్టిపెట్టు." అని గద్దించాడు. కళ్లు తుడుచుకొని నిలబడ్డాడు జాండుడాయ్.

"నీ ఉద్దేశం ఏమిటి—ఎందుకు వచ్చావ్?" అని ప్రశ్నించాడు మనోహర్.

"మన్నిస్తానని చెప్పు బాబా!" మళ్లీ ఏడుస్తూ అన్నాడు, జాండుడాయ్.

"మనఃపూర్తిగా నిన్ను మన్నిస్తున్నాను. భయం లేదు. ఉన్నది ఉన్నట్టు చెప్పు?"

జాండుడాయ్ చతికిలబడ్డాడు. కళ్లు తుడుచుకొని, భయపడుతూ నెమ్మదిగా అడిగాడు:

"బాబా మీరు బాణోలక్కితో కలిసారంట గదా?"

ఈ ప్రశ్నకు మనోహర్ తయారుగా లేడు. అయినా, తేరుకొని, అసహ్యం కనబరుచుతూ అడిగాడు: "ఎవరు చెప్పారు?"

"అదే సెప్పింది బాబా!"

"చెప్పిందా? నా పరువు తీసిందా?"

"బరోబరణ్‌లో, బాణోలక్కిదేవి ఎదట చెప్పింది బాబా, దాని కన్నెచెర విడిపించింది మీరే అని."

"అందరిలో నన్ను అవమానం చేసిందీ?" ఉద్వేగంతో గట్టిగా అరిచాడు మనోహర్.

"అవమానం కాదు బాబా! మా ఆసారమే అంత! కన్నెచెర విడిపించిన మగోడిపేరు చెప్పితే దాన్ని ఆడు పెళ్లిచేసుకోవాల బాబా." అన్నాడు జాండుడాయ్.

తలపై పిడుగుపడినట్టయి అదరిపోయాడు మనోహర్. "నన్ను చంపరావడానికీ దానికీ ఏం సంబంధం?" అని ప్రశ్నించాడు మనోహర్.

"మీరు ఉండగా దాన్ని మరోడు కన్నెత్తి సూడగూడదు బాబా."

"ఓహో! అందుకా నన్ను చంపవచ్చావ్?"

"దానికోసం, మీ పేణాలు తీయాలని వొచ్చేను బాబా." వలవల ఏడుస్తూ చెప్పాడు జాండుడాయ్.

"నా మూలంగా మీ ఇద్దరి పెళ్లికి ఆటంకం కలిగింది కదూ జాండుడాయ్?"

"ఇంక నేను దీనికోసం ఏపనీ తలపెట్టను బాబా, మన్నించండి."

"అది సరేలే! నా ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పు?—మీ ఇద్దరూ పెళ్లిచేసుకోవాలనుకొన్నారు గదా అని అడుగుతున్నాను."

"నిజమే బాబా."

"నేను రావడం మూలంగా - అంటే నేను ఆమెను మొదట అనుభవించడం మూలంగా నీకు పెళ్ళి చేసుకొనే అర్హత పోయిందన్న మాట-అంతేనా?"

"అంతే బాబా."

"అంటే - నేను బ్రతికిఉంటే నువ్వు వనలక్ష్మిని చేసుకోవడానికి వీలు లేదన్నమాట మీ ఆచారం ప్రకారం."

"అవును బాబా..." అని ఏదో చెప్పబోయాడు జాండుడాయ్.

అతని మాట చొరనివ్వకుండా మళ్లీ ప్రశ్నించాడు మనోహర్.

"అందుకని నన్ను చంపాలని వచ్చావ్."

"మన్నించండి, బాబా." కాళ్లు పట్టుకొంటూ సమాధానం చెప్పాడు, జాండుడాయ్. మనోహర్ ఒక్క క్షణం ఆలోచిస్తూ నిలబడి, "వనలక్ష్మికి నువ్వంటే ఇష్టమే కదూ! నిన్ను చేసుకొంటుందిగా?" అని అడిగాడు మనోహర్.

"వనలక్ష్మి బ్రహ్మచారిణిగా ఉండిపోతుంది మనోబాబా!" ప్రక్కనున్న పొదరింటి చాటునుంచి వస్తూ అంది బాణోలక్కి.

"ఓహో - ఇద్దరూ ఆలోచించుకొని వచ్చారన్న మాట!" వనలక్ష్మివైపు అసహ్యం కనబరచుతూ చూసి అడిగాడు మనోహర్.

"లేదు, బాబా! లేదు! మా బాణోలక్కిదేవి తోడు! నన్ను అనుమానిస్తున్నారా మనోబాబా! గుడిలో మీపేరు చెప్పినప్పటినుంచీ వీడు నిప్పులు క్రక్కుతున్నాడు. నాకోసం మిమ్మల్ని కడతేర్చివేస్తాడని భయపడిపోయాను. బతిమాలి గుడిసెకు పంపి ఇంటికి వెళ్లాను. నిద్దర రాలేదు. ఏదో ఆందోళన నన్ను కలచివేసింది. లేచి వెళ్లిచూస్తే జాండుడాయ్ గుడిసెలో లేడు. భయపడి ఇక్కడకు పరుగు పరుగున వచ్చాను. మొహంమీది ముసుగు తొలగిస్తూ మీరు కనబడ్డారు. ఈ పొదచాటున దాగి మీ మాటలు వింటున్నాను. వీడు మళ్లీ ఏ అఘాయిత్యమైనాచేస్తే ఇక్కడినుంచే వీడిపని పట్టించి ఉందును దీనితో." తళతళ మెరిసే కత్తి ఎత్తి చూపింది బాణోలక్కి. "మీరు నన్ను అనుమానిస్తే ఇక్కడే ఈ కత్తితో పొడుచుకు చస్తాను మనోబాబా! మీకు ఇప్పుడుకాదు; ఎప్పుడూ ద్రోహం తలపెట్టను మనోబాబా! అందుకే నేను బ్రహ్మచారిణిగా ఉండడానికి నిర్ణయం చేసుకొన్నాను. ఇంక దీనికి తిరుగులేదు. మీకు, సరళ అక్కకు ద్రోహం తలపెట్టను బాబా! చెప్పండి, ఇంకా నన్ను అనుమానిస్తున్నారా?" పొంగుకు వస్తున్న దుఃఖం ఆపుకొంటూ ఉద్వేగంతో అడిగింది బాణోలక్కి.

"నీ మనసు నాకు తెలుసు వనలక్ష్మీ! మిమ్మల్ని విడదీసి పాపానికి ఒడిగట్టుకొన్నాను."

"విడదీసుకొన్నదాన్ని నేను, మీరుకాదు; అందుకే బ్రహ్మచర్యం అవలంబిస్తున్నాను." అంది బాణోలక్కి.

"బ్రహ్మచర్యం అవలంబిస్తే ఏమైనట్టు?" అని అడిగాడు మనోహర్ జాండుడాయ్‌ని చూస్తూ.

"మొదటి మొగోడు చేసుకోకపోతే ఆడది బెమ్మసారిగా ఉండిపోవాలి బాబా." అన్నాడు జాండుడాయ్.

"మీ కట్టుబాట్లు ఏవిటో సవిస్తరంగా చెప్పు జాండుడాయ్." అన్నాడు మనోహర్, ఆసక్తితో.

"మగోడు బతికిఉండి ఇంకొకత్తెను పెళ్ళాడితే ఆడది బెమ్మసారిగా ఉండిపోవాలి. మగోడు సచ్చిపోయినా, పెళ్ళాడకుండా ఉండిపోయినా ఆడది ఇంకోణ్ణి కట్టుకోవచ్చు బాబా." జాండుడాయ్ వివరణ మనోహర్‌కు ఆనందం కలిగించింది.

"ఏదీ, ఇంకొకసారి చెప్పు." అని అడిగాడు. జాండుడాయ్ మళ్లీ చెప్పాడు.

"శభాష్ జాండుడాయ్! వనలక్ష్మిని నీకు పెళ్లి చేస్తాను." అన్నాడు మనోహర్ జాండుడాయ్ భుజం చరుస్తూ.

బాణోలక్కి మనోహర్ మొహం చూస్తూ అడిగింది: "మనో బాబా! మీ ఉద్దేశం ఏవిటి?"

"ఏముంది లక్ష్మీ! సమస్య అతిసులభంగా పరిష్కారమైపోయింది. నేను బ్రహ్మచారిగా ఉండిపోతే జాండుడాయ్ నిన్ను పెళ్ళాడవచ్చునుగా నిరభ్యంతరంగా?"

"బాబా..." ఏదో చెప్పబోయింది బాణోలక్కి.

"లక్ష్మీ నీకు నేనంటే గౌరవం ఉందికదా? ఇంతవరకు నామాటకు ఎదురుచెప్పలేదు నువ్వు. జాండుడాయ్ నిన్నెంత గాఢంగా ప్రేమిస్తున్నాడో నాకు తెలుసు. మీ ఇద్దరూ భార్యాభర్తలు కావడం నా అభిమతం. మనోబాబా మాట మన్నిస్తావనే అనుకొంటున్నాను." అన్నాడు ఆవేశంతో మనోహర్.

బాణోలక్కి తలఎత్తి మనోహర్‌ను చూసింది. 'ఇంక మనోబాబా ఏమాటా వినడు' అని అనుకొంది. తలవంచుకు నిలబడింది. జాండుడాయ్ వెర్రివాడిలా ఆ ఇద్దరి మొహాలు చూస్తూ నిలబడిపోయాడు. "లక్ష్మీ! నువ్వు ఇంటికి వెళ్లు. రేపు నా నిర్ణయం మీ పెద్దలకు

తెలియజేస్తాను." అని బాణోలక్కిని పంపివేశాడు. వెళ్లిపోతూ, మనోబాబాను మరొక్కమారు తేరిపార జూచింది వనలక్ష్మి. బరువైన గుండెతో, భారంగా అడుగులు వేసుకొంటూ వెళ్లిపోయింది.

"జాండుడాయ్, ఈరాత్రి ఇక్కడే నిద్రపో! రేపు పెళ్లికొడుకువు అవుతావు - నిశ్చింతగా పడుకో." అని ఆజ్ఞాపించి మనోహర్ మేను వాల్చాడు.

*   *   *   *

మనోహర్ స్నానంచేసి తిరిగి వచ్చేసరికి "మనోబాబా! మనోబాబా!" అని పలకరించింది పంజరంలోని చిలక. జాండుడాయ్ మొక్కలకు నీళ్లు పోస్తున్నాడు. వాడిపోయిన పూలదండలు అసహ్యంగా కనబడుతున్నాయి.

"ఏం-జాండుడాయ్ వనలక్ష్మి ఇంకా రాలేదు?" అని అడిగాడు మహోహర్.

"పొద్దుటినుంచీ జాడలేదు బాబా!" అన్నాడు జాండుడాయ్.

"సగం రాత్రివరకూ ఇక్కడే అయిపోయిందిగా. నిద్రపోతున్నదేమో చూసిరా! పూలవనంలో ఉందేమో చూసివస్తాను నేను." అని మనోహర్ పూలవనానికి వెళ్ళాడు.

జాండుడాయ్ బాణోలక్కి ఇంటికి వెళ్లాడు.

పూలవనంలో వనలక్ష్మి లేదు; ఈసరికి వచ్చి ఉంటుందని తిరిగి వచ్చాడు మనోహర్. ఇంట్లో బాణోలక్కి లేదు; ఈసరికి తిరిగి వచ్చిఉంటుందని తిరిగి వచ్చాడు జాండుడాయ్. లేదని మనోహర్ అన్నాడు. 'లేదు బాబా' అని జాండుడాయ్ అన్నాడు. ఊరు, వాడ వెదికాడు జాండుడాయ్. పుట్ట, గుట్ట వెదికాడు మనోహర్.

ఒకరోజు, రెండురోజులు - రెండు నెలలు గడిచిపోయాయి. వనలక్ష్మి జాడలేదు. "నా బ్రహ్మచర్యం తప్పించడానికి వనలక్ష్మి వనంలో కలిసిపోయింది. జాండుడాయ్." అన్నాడు మనోహర్ దీనంగా. "అది దేవత బాబా!" అన్నాడు జాండుడాయ్. "మనోబాబా! మనోబాబా!" అనే కీచుగొంతుక వినిపించింది. మనోహర్ అదరిపడి "జాండు, అదిగో వనలక్ష్మి పిలుస్తోంది." అన్నాడు సంభ్రమంతో. "కాదు బాబా! సిలక పిలుపు." అన్నాడు జాండుడాయ్.

"ఈ బంధాలు త్రెంపుకొని వనలక్ష్మి పక్షిలాగ వెళ్లిపోయింది జాండు! ఆమె పెంచిన ఈ పక్షిని ఈ పంజరంలో బంధించడం ఎందుకు? 'కీరకుమారిని' వదలివేసెయ్." అన్నాడు మనోహర్.

జాండుడాయ్ పంజరంలోని చిలకను వదలివేశాడు. "మనోబాబా! మనోబాబా!" అని అరుస్తూ ఎగిరిపోయింది స్వేచ్ఛాప్రపంచంలోకి రామ-చిలుక.

చెమర్చిన కళ్ళతో అందరివద్ద సెలవుతీసుకొని బయలుదేరాడు మనోహర్. "అందాహోయ్, జిందోబోయ్!" అని ఎలుగెత్తి అభివాదం చేశారు అందరూ. వనలక్ష్మి కంఠం కలియని ఆ అభివాదం అంతా వెలితిగా, ఎంతో కలతగా తోచింది మనోహర్‌కు. చేయెత్తి అందరికీ నమస్కరించాడు. ఏటి ఒడ్డున ఏడాదిక్రితం తాను, మోహన్ కూర్చున్న చోటునుంచి బయలుదేరాడు. 'బాబా' దగ్గర సెలవుతీసుకుని అడవి మనుషులు బరువెక్కిన గుండెలతో వెనక్కు తిరిగారు. మావిడిచెట్టుమీద చిలక "మనోబాబా! మనోబాబా!" అని పలకరించింది.

"కీరకుమారీ! వెళ్లిపోతున్నా." అన్నాడు కళ్లు తుడుచుకుంటూ మనోహర్.

బరువుగా అడుగులువేస్తూ బయలుదేరాడు మనోహర్. సంచి భుజాన తగిలించుకొని 'బాబా'ను అనుసరించాడు జాండుడాయ్.